క్లుప్తంగా

అడవికి నిప్పుపెట్టొద్దు

● ఎఫ్ఎస్ఓ నారాయణ



వాజేడు : అడవుల్లో పెరిగే చెట్లతోనే ప్రజలకు, ఇతర జీవాలకు స్వచ్ఛమైన గాలి అందుతుందని ఎఫ్ఎస్ఓ నారాయణ అన్నారు. మండల పరిధిలోని చెరుకూరు సెక్షన్‌లోని లక్ష్మీపురంలో బుధవారం స్థానికులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ మాట్లాడుతూ ఇప్ప పువ్వులు, చీపురు పుల్లలు సేకరించేందుకు అడవి వెళ్లిన వారు చెట్లకింద సేద తీరే సమయంలో పొరపాటున నిప్పు పెట్టొద్దన్నారు. అడవిలో మంటలు చెలరేగితే స్థానికులు అటవీ సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాటు మంటలను ఆర్పే ప్రయత్నం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అటవీ శాఖ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

'ఎస్సీ వర్గీకరణపై నిరసన'



గోవిందరావుపేట : ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ పస్రా గ్రామంలో దళితులు ఆందోళన చేపట్టారు. మండల పరిధిలోని పస్రాలో మాల మహానాడు గ్రామ కమిటీ అధ్యక్షుడు గంగెల్లి భరత్ ఆధ్వర్యంలోబుధవారం పలువురు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ తెలంగాణ అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణను 1,2,3 అని మూడు గ్రూప్‌లుగా వర్గీకరించి తెలంగాణ శాసనసభ ఆమోదించడాన్ని వ్యతిరేకిస్తూ నిరసన తెలియజేసినట్లు ఆయన పేర్కొన్నా రు. కార్యక్రమంలో గాజుల కిరణ్, పూర్ణ, నారాయణ, నిరంజన్, లక్ష్మీనారాయణ, సందీప్,సతీష్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో ఆత్మస్థైర్యం



వెంకటాపురం(కె) : క్రీడలతో ఆత్మస్థైర్యం పెంపొందుతుందని వెంకటాపురం(కె) ఎంఈఓ జీవీవీ సత్యనారాయణ అన్నారు. మండల కేంద్రంలోని కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ ప్రాంగణంలో బుధవారం వరంగల్‌కు చెందిన నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో యువత అసోసియేషన్ క్రీడా పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులు, ప్రశంస పత్రాలను అందించి ఎంఈఓ మాట్లాడారు. యువకులు వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు.

బొడ్రాయి ప్రతిష్ఠాపన పూజలు

వాజేడు : మండలంలోని అయ్యవారిపేటలో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమాన్ని బుధవారం ప్రారంభించారు. పూజారులు బాలచంద్ర శాస్త్రి, రంగు రవీందర చారి ఆధ్వర్యంలో ఉదయం హోమం నిర్వహించారు, మధ్యాహ్నం శాస్త్రోక్తంగా యాగశాలను ప్రారంభించారు. సాయంత్రం విగ్రహాలకు జలాభిషేకం చేశారు. గురువారం పలు కార్యక్రమాలను నిర్వహించి శుక్రవారం విగ్రహాల ప్రతిష్ఠాపన నిర్వహించనున్నట్లు గ్రామస్తులు తెలిపారు.

కొనసాగుతున్న వార్షికోత్సవ పూజలు..

మంగపేట : మండలంలోని బోరునర్సాపురం సీతారామాంజనేయ స్వామి ఆలయంలో 18వ వార్షికోత్సవాలు బుధవారం రెండోజు ఉదయం ప్రభోద సేవాకలం పూజలను వేద పండితులు నిర్వహించారు. మధ్యాహ్నం మంగళ శాసనము, దేవతా మూర్తులకు మహానివేదన, తీర్థ ప్రసాద గోష్టి కార్యక్రమాలను పూజారి జీడికంటి మధుసూదనాచార్యులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, భక్తులు పాల్గొన్నారు.

గుడుంబా స్వాధీనం

వాజేడు : మండల పరిధిలోని పేరూరులో బుధవారం పోలీసులు గుడుంబా స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై గుర్రం కృష్ణ ప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం..పేరూరులో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా పక్కా సమాచారం మేరకు అదే గ్రామానికి చెందిన తుందూరి నాగలక్ష్మి ఇంట్లో తనిఖీ చేయగా 20 లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు చెప్పారు. నాటుసారాను స్వాధీనం చేసుకోవడంతో పాటు ఆమెపై కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు. ఈ తనిఖీల్లో ఎస్సైతో పాటు హెడ్‌కానిస్టేబుల్ సంతోష్, కానిస్టేబుల్ సత్యాన్వేష్, నరేష్ ఉన్నారు.

సంక్షేమ పథకాలను వివరించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి : కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను నాయకులు, కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆ పార్టీ మండల అధ్యక్షుడు బొల్లు దేవేందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండలంలోని మేడారం, ఊరట్టం, కాల్వపల్లి, నార్లాపూర్ పడిగాపూర్, ఎలుబాక, వెంగ్లాపూర్, బయ్యక్కపేట గ్రామాలకు క్లస్టర్ ఇన్‌చార్జ్‌లను నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ గెలుపు కోసం క్లస్టర్ ఇన్‌చార్జ్‌లు, నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలన్నారు.

నాణ్యతకు తిలోదకాలు!

● ప్రధాన రోడ్డుపై పర్యవేక్షణ కరువు..
● ధ్వంసమవుతున్న బీటీ
● గుంతలమయంగా మారుతున్న వైనం



బోరునర్సాపురం వద్ద బీటీ లేచి ప్రమాదకరంగా మారిన రోడ్డు

మంగపేట : మండలంలోని ఏటూరునాగారం–బూర్గంపాడు ప్రధాన రోడ్డుపై ఆర్అండ్‌బీ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా లోపించింది. దీంతో జిల్లా సరిహద్దులోని బ్రాహ్మణపల్లి నుంచి ఏటూరునాగారం జాతీయ రహదారి 163 వరకు గల 34 కిలోమీటర్ల రోడ్డుపై బీటీ తేలి గుంతలమయంగా మారింది. 2022, 2023లో 34 కిలోమీటర్ల రోడ్డు మరమ్మతులు, బీటీ రెనివల్ చేసేందుకు ప్రభుత్వం రెండు సార్లు రూ.9.50 కోట్లు మంజూరు చేసింది. అనంతరం మరో రూ.6 కోట్ల వరకు మొత్తం రూ.15 కోట్లకు పైగా మంజూరయ్యాయి. దీంతో కాంట్రాక్టర్ పనులను గడువులోగా పూర్తి చేయక పోవడమే కాకుండా పనులు చేపట్టడంలో ప్రభుత్వ నిబంధనలు పాటించలేదు. తనకున్న రాజకీయ పలుకుబడితో ఆర్అండ్‌బీ శాఖకు చెందిన ఓ ఉన్నతాధికారితో కుమ్మక్కై నాసిరకంగా రోడ్డు మరమ్మతులు, బీటీ రెనివల్ పనులు చేపట్టారు.

ఏడాది గడవకుండానే బీటీ ధ్వంసం..

మండలంలోని తిమ్మంపేట క్రాస్ రోడ్డు నుంచి మంగపేట వరకు ప్రధాన రోడ్డుపై వేసిన బీటీ బోరునర్సాపురం వద్ద ఏడాది గడవక ముందే తేలిపోయి ప్రమాదకరంగా మారింది. ఇదే విధంగా గతంలో కమలాపురం, చుంచుపల్లి, రాజుపేట, బ్రాహ్మణపల్లి వద్ద రోడ్డుపై వేసిన బీటీ తేలిపోయింది. విషయంపై ఆర్అండ్‌బీ డీఈ రఘువీర్‌ను సంప్రదించగా తిరిగి మరమ్మతులు చేయిస్తామని చెప్పి మూడేళ్లు దాటిపోయింది. రాజకీయ పలుకుబడితో రోడ్డు పనులు దక్కించుకుని నాసిరకంగా పనులు చేసి కోట్ల రూపాయల ప్రజాధనం కొల్లగొడుతున్న గుత్తేదారుల నుంచి సంబంధిత అధికారులు కమీషన్లు దండుకుని వంత పాడుతున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఏజెన్సీ ప్రాంతంలో ఏఈ స్థాయి నుంచి నేడు డీఈ స్థాయి వరకు ఎదిగిన ఓ అధికారికి రోడ్డు పనుల్లో వాటా ఉందనే ప్రచారం జరుగుతోంది.

12 నుంచి మినీ మేడారం జాతర

మేడారం సమ్మక్క–సారలమ్మ మినీ జాతరకు రాష్ట్రంలోని భద్రాద్రికొత్తగూడెం, ఖమ్మం జిల్లాలతోపాటు ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు మంగపేట మీదుగా మేడారానికి చేరుకుంటారు. అదే విధంగా మేడారం జాతరకు వచ్చే భక్తులు మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామిని దర్శించుకుంటారు. విషయంపై మంత్రి సీతక్క స్పందించి ప్రమాదకరంగా తయారైన రోడ్డుకు మరమ్మతు పనులు చేపట్టే విధంగా చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయంపై వివరణ అడిగేందుకు ఆర్అండ్‌బీ డీఈ రఘువీర్‌ను ఫోన్‌లో సంప్రదించగా ఆయన స్పందించలేదు.

విచారణ చేపట్టాలి



బ్రాహ్మణపల్లి నుంచి ఏటూరునాగారం జాతీయ రహదారి 163 వరకు గల 34 కిలో మీటర్ల ప్రధాన రోడ్డు మరమ్మతులు, బీటీ రెనివల్ పనులకు ప్రభుత్వం ఎన్ని నిధులు కేటాయించింది? పనులు ఎంత మేరకు జరిగాయి, కాంట్రాక్టర్‌కు చెల్లించిన బిల్లులపై విచారణ చేయించాలి. నాసిరకంగా పనులు చేసిన కాంట్రాక్టర్‌తో పాటు చేయని పనులను చేపట్టినట్లుగా తప్పుడు ఎంబీ రికార్డు చేసిన అధికారులను సస్పెండ్ చేయాలి.

– అన్నెబోయిన సమ్మయ్య, ప్రజాసంఘాల నేత

యథేచ్ఛగా గ్రావెల్ తవ్వకాలు

● అడ్డుకున్న సీపీఎం నాయకులు



గ్రావెల్ తవ్వకాలను అడ్డుకుంటున్న నాయకులు

వాజేడు : మండల సరిహద్దులో యథేచ్ఛగా మైనింగ్ (గ్రావెల్) తవ్వకాలు నిర్వహిస్తున్నారు. దీంతో సీపీఎం నాయకులు బుధవారం మైనింగ్ తవ్వకాలను అడ్డుకున్నారు. ఏటూరునాగారం మండలంలోని ఇసుక క్వారీకి గ్రావెల్ తవ్వకాలను వాజేడు మండలం నుంచి చేపట్టారు. పట్టాభూమికి అనుమతి తీసుకుని ప్రభుత్వ భూమిలో నుంచి గ్రావెల్ తవ్వకాలను చేస్తుండడంతో సీపీఎం నాయకులు కొప్పుల రఘుపతి రావు, గుగ్గిళ్ల దేవయ్య, దామోదర్, బచ్చలి కృష్ణ బాబు, పూనెం కృష్ణ బాబు గ్రావెల్ తవ్వకం పనులను అడ్డుకున్నారు.విషయం తెలుసుకున్న పోలీసులు, తహసీల్దార్, సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. 1/70, పీసా చట్టాలు ఉన్నప్పటికీ వాటిని ఎలా అమలు చేస్తారని అధికారులను వారు ప్రశ్నించారు.

మైనింగ్ తరలింపును అడ్డుకోవాలి

అక్రమంగా మైనింగ్ (గ్రావెల్) తరలింపును వెంటనే అడ్డుకోవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో బుధవారం తహసీల్దార్ శ్రీరాముల శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆ సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు జెజ్జరి దామోదర్ మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70, పెసా చట్టాలను అధికారులు తుంగలో తొక్కుతున్నారని విమర్శించారు. అక్రమంగా అనుమతులను ఇస్తూ ఏజెన్సీ సంపదను కొల్లగొట్టేలా చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పెసా గ్రామసభ లేకుండా మైనింగ్, రెవెన్యూ శాఖల అధికారులు ఎలా అనుమతి ఇస్తారని విమర్శించారు. ముత్తయ్య, కృష్ణ బాబు, ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలి



అవగాహన కల్పిస్తున్న ప్రిన్సిపాల్ మల్లేశం

ములుగు : విద్యార్థులు ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకోవాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కొప్పుల మల్లేశం సూచించారు. ఈ మేరకు బుధవారం కళాశాల ప్లేస్‌మెంట్ సెల్ కన్వీనర్ శిరీష ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి ప్రిన్సిపాల్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు తమ నైపుణ్యాలను ప్రదర్శిస్తూ భవిష్యత్ కార్యాచరణను రూపొందించుకోవాలని తెలిపారు. సఖి సెంటర్ సీఈఓ సాల్మన్‌రాజు మాట్లాడుతూ విద్యార్థులు స్వయం ఉపాధి, వ్యాపార నైపుణ్యాలు, ఉత్పత్తి సేవల మార్కెటింగ్‌పై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బాలయ్య, అకాడమీ కోఆర్డినేటర్ డాక్టర్ భాస్కర్, టీఎస్‌కేసీ కన్వీనర్ కవిత, అధ్యాపకులు సరిత, శిరీష, రాధిక, అనిల్‌కుమార్, జగదీష్, ఉదయశ్రీ, విజిత, తేజోలత, మౌలానా, అనిత, నవీన్, ఐలయ్య, లక్ష్మి, షరీఫా, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

వెంకటాపురం(కె) : మండల కేంద్రంలోని ప్రభుత్వ భూములను కాపాడాలని కోరుతూ ఆదివాసీ సంక్షేమ పరిషత్ జిల్లా కన్వీనర్ పర్శిక సతీష్ ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ ఏజెన్సీలో 1/70 చట్టానికి విరుద్ధంగా ప్రభుత్వ భూమిని ఆక్రమించి వలస గిరిజనేతరులు బహుళ అంతస్తులను నిర్మించడంతో పాటు క్రయ, విక్రయాలను చేస్తున్నట్లు ఆరోపించారు. నూగూరు(జి) సర్వే నెంబర్ 23/1 పై సమగ్ర విచారణ చేపట్టి ప్రభుత్వ కార్యాలయాలకు ఉపయోగించాలని కోరారు. వెంకటాపురం(జెడ్)లోని సర్వే నంబర్ 68, 69 లోని ప్రభుత్వ భూమిలో అనుమతులు లేకుండా గిరిజనేతరులు, నాయకులు, అధికారుల అండదండలతో బహుళ అంతస్తులను నిర్మిస్తున్నారని వెల్లడించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో తుర్స కృష్ణ బాబు, తాటి రాంబాబు, బొగ్గుల రాజ్ కుమార్, వినోద్, అర్జున్, నాగరాజు ఉన్నారు.

'తీన్మార్ మల్లన్నపై కేసు నమోదు చేయాలి'



ఫిర్యాదు చేస్తున్న రెడ్డి సంఘం నాయకులు

గోవిందరావుపేట : రెడ్డి కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేసిన తీన్మార్ మల్లన్నపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మండల సంఘం నాయకులు బుధవారం పస్రా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. రాజ్యాంగం ద్వారా ఎన్నుకోబడి అన్ని కులాలను సమాన దృష్టిలో చూడాల్సిన బాధ్యతను మరచి ఒక రెడ్డి వర్గాన్ని టార్గెట్ చేసుకోని వివాదస్పద వ్యాఖ్యలు చేయడం సరికాదు అని రెడ్డి సంఘం నాయకులు మండిపడ్డారు. వెంటనే రెడ్డి కులస్తులకు తీన్మార్ మల్లన్న బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జనార్దన్ రెడ్డి, లింగా రెడ్డి, సత్యనారయణ రెడ్డి, యాదగిరి రెడ్డి, రవీందర్ రెడ్డి, సాంబశివరెడ్డి, ఎల్లారెడ్డి, పూలమ్మ, రమాదేవి, సంధ్యారాణి, సమ్మక్క తదితరులు పాల్గొన్నారు.

రెడ్ల మనోభావాలను దెబ్బతీశాయి

ములుగు : బీసీ గర్జన సభలో తీన్మార్ మల్లన్న మాట్లాడిన విధానం రెడ్ల మనోభావాలను దెబ్బతీశాయని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా నాయకుడు వేముల సమ్మిరెడ్డి అన్నారు. జిల్లాకేంద్రంలో బుధవారం జరిగిన సంఘం సభ్యుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్సీ స్థాయిలో ఉండి రాజ్యాంగానికి విరుద్ధమైన పదజాలంతో మాట్లాడడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. తీన్మార్ మల్లన్న బేషరతుగా రెడ్లకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో తుమ్మ పిచ్చిరెడ్డి, పల్లె జయపాల్‌రెడ్డి, చిన్నారెడ్డి, గట్ల శ్రీనివాస్‌రెడ్డి, నారాయణరెడ్డి, ఇంద్రసేనారెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రాంరెడ్డి, చెంచురెడ్డి తదితరులు పాల్గొన్నారు.


బడ్జెట్‌లో తెలంగాణకు తీరని అన్యాయం




సీపీఎం నాయకుల నుంచి దిష్టిబొమ్మను లాక్కుంటున్న పోలీసులు

వాజేడు : మండలంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేయడానికి యత్నిస్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్రానికి తీరని అన్యాయం చేసిందని అందుకు నిరసనగా బుధవారం కేంద్రం ప్రభుత్వం దిష్టిబొమ్మను సీపీఎం నాయకులు దహనం చేయడానికి ప్రయత్నించారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న పోలీసులు పార్టీ నాయకులను పోలీస్ స్టేషన్‌కు తరలించారు. తాము శాంతియుతంగా ఆందోళన చేస్తున్నామని సీపీఎం నాయకులు పోలీసులకు చెప్పారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి మాట్లాడుతూ తెలంగాణాలో ఎనిమిది మంది ఎంపీలు ఉండగా అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ఉన్నారన్నారు. అయినప్పటికి బడ్జెట్ కేటాయింపులో తెలంగాణకు తీరని అన్యాయం జరిగిందని తెలిపారు. బయ్యారం ఉక్కు కర్మాగారం, కొత్త రైల్వే లైన్ కేటాయింపులు, ఏళ్ల తరబడి పసుపు రైతులు చేస్తున్న ఆందోళన ఊసే లేదన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు తప్ప ఇతర రాష్ట్రాలకు నిధులను కేటాయించ లేదని ఆయన విమర్శించారు. ఈ కార్యక్రమంలో జెజ్జరి దామోదర్, తోలెం ముత్తయ్య, బచ్చలి కృష్ణబాబు, గుగ్గిళ్ల దేవయ్య, బచ్చలి సొమ్మయ్య, పూనెం కృష్ణ బాబు, జెజ్జరి ఆదినారాయణ తదితరులు ఉన్నారు.

గోవిందరావుపేట: క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



ములుగు: సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు



బీసీలకు అండగా కాంగ్రెస్



ఏటూరునాగారం: సమావేశంలో మాట్లాడుతున్న వెంకన్న, రఘు

సాక్షి నెట్‌వర్క్: కులగణన చేపట్టి బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించిన రాష్ట్ర ప్రభుత్వానికి కాంగ్రెస్ పార్టీ నాయకులు ధన్యవాదాలు తెలిపారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి సీతక్క చిత్రపటాలకు బీసీ నాయకులు క్షీరాభిషేకం చేశారు. బాణాసంచా కాల్చి సంబురాలు చేసుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో బీసీ, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో 'గుడిమెలిగె'



ఏటూరునాగారం: బయ్యక్కపేట సమ్మక్క గుడిపై ఎట్టిగడ్డిని పేరుస్తున్న పూజారులు



నాగులమ్మ పసిడికుండలను శుభ్రం చేస్తున్న పూజారులు



ఐలాపూర్ సారలమ్మ గద్దె వద్ద..



సమ్మక్క గద్దె..

ఎస్ఎస్ తాడ్వాయి : మండలంలోని సమ్మక్క తల్లి పుట్టిల్లు బయ్యక్కపేటలో బుధవారం గుడిమెలిగె పండుగ చంద వంశ తలపతులు, వడ్డెలు వైభవంగా నిర్వహించారు. అమ్మవారి గుడిసెపై అడవిలో నుంచి కొత్తగా సేకరించిన ఎట్టిగడ్డిని గుడిపై కప్పారు. అనంతరం పవిత్ర స్థలంలోని పుట్టమట్టితో గుడి గోడలను అలికి ముగ్గులతో అలంకరించారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు గుడిమెలిగె పూజలు నిర్వహించారు. గుడిమెలిగె పండుగతో బయ్యక్కపేటలో పండుగ వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో పూజారులు చంద పరమయ్య, బాబురావు, గోపాల్‌రావు, కళ్యాణ్ పాల్గొన్నారు.

కొండాయిలో..

ఏటూరునాగారం : మండలంలోని కొండాయిలో కొలువైన గోవిందరాజులు, నాగులమ్మ గుడి, దొడ్లలోని సారలమ్మ గుడిలో గుడిమెలిగె పూజ కార్యక్రమాలను పూజారులు దబ్బగట్ల గోవర్ధన్, జనార్దన్, కాక వెంకటేశ్వర్లు నిర్వహించారు. ఈనెల 12 నుంచి జాతర ప్రారంభం కానుందని, ఈ సందర్భంగా వారం రోజుల ముందుగా గుడిమెలిగె పండుగ చేయడం ఆనవాయితీ వస్తోందన్నారు. బుధవారం గుడిలోని పూజా సామగ్రిని శుభ్రం చేసి, గుడిని శుద్ధిచేసి, మామిడితోరణాలతో అలంకరించారు. దూపం వేసి పూజించారు. నాగులమ్మ ఆలయంలోని పసిడి కుండలకు పసుపు పూసి కుంకుమ బొట్లతో అలంకరించారు. ఇంటి ఆడబిడ్డలు దీపాలను వెలిగించి పూజలు చేశారు. దీంతో కొండాయి, దొడ్ల గ్రామాల్లో పండుగ సందడి నెలకొంది. కార్యక్రమంలో రఘు, రాజారాం, విష్ణు, సదానందం, నాగేశ్వర్ రావు, బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఐలాపుర్ సమ్మక్క–సారలమ్మ గుడిలో..

కన్నాయిగూడెం : మండలంలోని ఐలాపుర్ గ్రామంలో 12వ తేదీనుంచి నిర్వహించే సమ్మక్క–సారలమ్మల జాతరకు మండె మెలిగె పండుగను పూజారులు ఆదివాసీ సాంప్రదాయలతో బుధవారం ఘనంగా నిర్వహించారు. మొదట గుడి, గద్దెలను శుద్ధి చేసి రంగులు వేసి అలంకరించి సుందరంగా తయారు చేశారు.

జాతర పోస్టర్ల ఆవిష్కరణ

మంగపేట : మండలంలోని బుచ్చంపేట పంచాయతీ పరిధిలోని జబ్బోనిగూడెం సమీపంలో గల నెమళ్లగుట్టలో ఈనెల 11 నుంచి 14వ తేదీవరకు జరుగనున్న సమ్మక్క–సారలమ్మ, నాగులమ్మ జాతర వాల్ పోస్టర్లను పోలీస్ స్టేషన్‌లో ఎస్సై టీవీఆర్ సూరి బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆలయ పూజారి(దేవరబాల) కుంట్ల నరేష్ మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సాంప్రదాయ బద్ధంగా ఈనెల 11నుంచి నాలుగు రోజుల పాటు అత్యంత వైభవంగా జాతర నిర్వహించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మైల జయరాంరెడ్డి, నాయకులు, ఏజెన్సీ గొడహక్కుల సంఘం జిల్లా అధ్యక్షుడు కారుపోతుల నర్సయ్యగౌడ్, దామెర సారయ్య, యానయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

పెట్టుబడిదారులకే కేంద్రం రాయితీలు

ములుగు రూరల్ : బడ్జెట్‌లో కార్పొరేట్, పెట్టుబడిదారులకు కేంద్ర ప్రభుత్వం రాయితీలు ప్రకటించిందని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ అన్నారు. ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలోని ప్రజా సంఘాల కార్యాలయంలో జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు ఎలాంటి రుణమాఫీ వర్తింపజేయకుండా పేదలపై భారం మోపిందని విమర్శించారు. విద్యా, ఆరోగ్యం, గ్రామీణాభివృద్ధి, సామాజిక సంక్షేమం రంగాలపై పెట్టే ఖర్చు గత ఏడాది బడ్జెట్ కంటే తగ్గించారని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు రుణమాఫీ, పంటలకు మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రత్నం రాజేందర్, ఎంబీ గఫూర్, ప్రవీణ్, తోకల రవి, రవిందర్, లక్ష్మణ్, చంటి, ప్రియదర్శిని, భరత్, తదితరులు పాల్గొన్నారు.

పోలీసుల అదుపులో మాజీ సర్పంచ్‌లు

ఏటూరునాగారం : అప్పులు చేసి గ్రామాలను అభివృద్ధి చేశామని, తమకు న్యాయం చేయాలని మాజీ సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఈసం రామ్మూర్తి అన్నారు. ఏటూరునాగారం మండలంలోని 12 గ్రామ పంచాయతీల మాజీ సర్పంచ్‌లను బుధవారం ఏటూరునాగారం పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా మాజీ సర్పంచ్‌లు మాట్లడుతూ..గత ప్రభుత్వం హయాంలో గ్రామాల అభివృద్ధికి అప్పులు చేసి పనులు చేయించామన్నారు. ఏంబీ రికార్డ్‌లు, బిల్లులు ఉన్నాయని అయిన కూడా ఇప్పటి వరకు నిధులు విడుదల చేయలేదన్నారు. రాష్ట్ర సంఘం పిలుపు మేరకు బుధవారం ఉపముఖ్యమంత్రి, పంచాయతీ రాజ్ మంత్రి కార్యాలయాల ముట్టడికి వెళ్తుంటే తమను అడ్డుకుని అక్రమ అరెస్టులు చేయడం అన్యాయం అన్నారు. అరెస్ట్ అయిన వారిలో దొడ్డ కృష్ణ, ముకుంద రావు, గార రమాదేవి, ఈశ్వర్, దేవేందర్, చిన్నన్న తదితర మాజీ సర్పంచ్‌లు ఉన్నారు.

మహాసభలను విజయవంతం చేయాలి

ఏటూరునాగారం : ములుగులో ఈనెల 12వ తేదీన నిర్వహించే తెలంగాణ రాష్ట్ర రైతు సంఘం జిల్లా రెండో మహాసభను జయప్రదం చేయాలని ఏఐకేఎస్ రాష్ట్ర నాయకుడు జంపాల రవీందర్ పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో ఏఐకేఎస్ కార్యాలయంలో మండల నాయకుడు గోగు సీతారాములు అధ్యక్షతన జరిగిన సంఘం సన్నాహక సమావేశంలో రవీందర్ పాల్గొని మాట్లాడారు. ములుగు జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల భవనంలో జరిగే సంఘం ద్వితీయ మహాసభలను జయప్రదం చేయాలని రైతులకు కోరారు. రైతాంగం ఎదుర్కొంటున్న అనేక సమస్యలు కనీస మద్దతు ధరలు కల్పించే చట్టం చేయాలని ఢిల్లీ కేంద్రంగా రైతు నాయకుడు గుర్మీత్ సింగ్ దల్లేవాల అమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ దేశ ప్రధాని నరేంద్రమోదీ స్పందించకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. పైగా ఆ ఉద్యమాలకు ఇతరత్రా సంఘ వ్యతిరేక శక్తులతో సంబంధాలు ఉన్నాయనడం సిగ్గుచేటని అన్నారు. ములుగులో జరిగే మహాసభలకు రైతులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఈ సమావేశంలో జిల్లా కన్వీనర్ ఎండీ అమ్జద్‌పాషా, వెల్దండి కొమురయ్య, భిక్షపతి, సిద్ధం నర్సయ్య, చింతలపల్లి లక్ష్మయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన

వాజేడు : రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో బుధవారం ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ మాధురి ప్రభుత్వ బ్యాంకుల ద్వారా లబ్ధి పొందే పథకాల ప్రయోజనాలను వివరించారు. ప్రధాన మంత్రి జీవన జ్యోతిబీమా యోజన, ప్రధాన మంత్రి సురక్ష బీమా యోజన, ఆన్‌లైన్ మోసాలు, కేవైసీ, ఈకేవైసీ పై అవగాహన కల్పించారు.

వర్గీకరణ నిర్ణయం చరిత్రాత్మకం

ములుగు : ఎస్సీ వర్గీకరణకు అసెంబ్లీలో ఆమోదం తెలుపుతూ సానుకూల నిర్ణయం తీసుకోవడం చరిత్రాత్మకం అని ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు మట్టెవాడ తిరుపతి పేర్కొన్నారు. ఈ మేరకు జిల్లా కేంద్రంలో బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణకు అండగా నిలవలేదని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఎస్సీ వర్గీకరణకు మద్దతు తెలపడం సంతోషకరమని అన్నారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం



ములుగు రూరల్ : మండలంలోని జగ్గన్నపేట బాలికల ఆశ్రమ పాఠశాలలో స్వయం పరిపాలన దినోత్సవాన్ని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు పాఠశాల విద్యార్థులు ఉపాధ్యాయులుగా విద్యాబోధన చేశారు. ఐటీడీఏ పీఓగా శశికళ, డీడీగా వెన్నెల, ఏటీడీఓగా సుకన్య, వార్డెన్‌గా హారిక వ్యవహరించారు. ఉపాధ్యాయ పాత్రల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయలక్ష్మి, ఉపాధ్యాయులు లక్ష్మి, రమాదేవి, బన్సీలాల్, జయరాం, రాజు, సృజన, పూర్ణబాయి, సుశీల, వార్డెన్ అనిత తదితరులు పాల్గొన్నారు.